



తుంగభద్ర ఎగువ కాలువ (ఫైల్)

పండంటి బిడ్డతో కుటుంబ సమేతంగా పుట్టింటి నుంచి మెట్టినింటికి ఆనందంగా వెళుతున్న ఓ కుటుంబాన్ని కారు రూపంలో మృత్యువు కబళించింది. కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళలు, ఆరు నెలల చిన్నారి మృతి చెందిన విషాదఘటన అనంతపురం జిల్లా కూడేరు మండలంలో చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్క చెల్లెళ్లు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఘోరం



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

ఘటనాస్థలంలో కారు

మృతిచెందిన చిన్నారి విద్యశ్రీ

కూడేరు వద్ద రోడ్డు ప్రమాదం
ఆటోని ఢీకొన్న కారు
నలుగురు మృతి







మృతులు సరస్వతి, యోగేశ్వరి, చిన్నారి విద్యశ్రీ (ఫైల్‌ఫొటోలు)

ఉరవకొండ మండలం రాయాపురం గ్రామానికి చెందిన సతీష్‌కు గార్లదిన్నె మండలం మార్తాడు గ్రామానికి చెందిన సరస్వతి అనే మహిళతో పదేళ్ల కిందట వివాహమైంది. మూడేళ్ల కిందట ఓ బాబు పుట్టగా ఆరు నెలల కిందట పండంటి ఆడబిడ్డకు సరస్వతి జన్మనిచ్చింది. ఆరు నెలల తర్వాత అత్తగారింటికి వెళ్లడానికి పుట్టింటి నుంచి సోమవారం వడిబియ్యం పోసుకుని తన ఇద్దరు అక్కలతో కలిసి ఆటోలో గార్లదిన్నె మండలం నుంచి బయలుదేరారు. కారు రూపంలో తమ జీవితాలను బలి తీసుకుంటుందని ఆడబిడ్డలకు తెలియలేదు. కూడేరు మండలం కమ్మూరు గ్రామ సమీపంలో స్కంద వెంచర్ వద్ద ఉరవకొండ నుంచి వేగంగా వస్తున్న కారు వీరి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో సరస్వతి (40) అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన ఆరునెలల చిన్నారి విద్యశ్రీ సరస్వతి సోదరిలు యోగేశ్వరి (45), నీలమ్మ (50) ఆసుపత్రిలో మృతిచెందారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన కారులో అనంతపురంలోని ఓ ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ముగ్గురు యువకులు ఇద్దరు యువతులు ఉన్నట్లు సమాచారం. పెన్నోబిలం నుంచి అనంతపురానికి వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టినట్లు తెలిసింది. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆధునీకరణ అటకెక్కినట్లేనా ?

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు అరకొర నిధులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాకు నికర జలాలను అందించే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ ఈసారి కూడా అటకెక్కినట్టు కనిపిస్తోంది. దీంతో దీని కిందనున్న గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, మిడ్ పెన్నార్ దక్షిణ కాలువల ఆధునీకరణ కూడా ఆగిపోయినట్లే అనిపిస్తోంది. హంద్రీనీవాకు కొంత వరకు నిధులు కేటాయించినప్పటికీ తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ రెండు దశలకు కలిపి రూ.70 కోట్ల వరకే ఇచ్చారు. దీంతో అంతకు మునుపు నడుస్తున్న పనుల పురోగతి దాదాపు ఆగిపోయినట్టే కనిపిస్తోంది.

ఆధునీకరణ ఆగింది

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ అనంతపురం జిల్లా సరిహద్దు 105.437 కిలోమీటరు నుంచి 189.680 కిలోమీటరు వరకు ఆధునీకరించేందుకు గతంలో పనులు చేపట్టారు. రూ.458 కోట్లతో చేపట్టిన ఈ పనులు రూ.309 కోట్లు ఖర్చు పెట్టాక గత వైసిపి ప్రభుత్వం 2020లో ఈ పనులను రద్దు చేసింది.మరో ఐదేళ్లు ఈ పనులు చేపట్టేందుకు వీల్లేదని షరతు పెట్టింది. అయితే ఆ ఐదేళ్ల సమయం కూడా పూర్తయింది. దీంతో ఈ బడ్జెట్‌లో ఆధునీకరణను చేపడతారని జిల్లావాసులు ఆశించారు. కాని ఆ రకమైన కేటాయింపులు బడ్జెట్‌లో జరగలేదు. కేవలం మరమ్మతులకు గత బడ్జెట్‌లో పెట్టిన రూ.25 కోట్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఒకవైపు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. ఎప్పుడు ఎక్కడ గండ్లు పడతాయోనని నీటిని పొదుపుగా తీసుకోవాల్సి వస్తోంది. తుంగభద్ర డ్యామ్‌లో నీరు పొంగిపోర్లినా ఎగువ ప్రధాన కాలువకు ఎక్కువగా నీటిని తీసుకునే అవకాశం లేకుండా ఉంది.

ఆగిన గుంతకల్లు ఉప కాలువ ఆధునీకరణ

గుంతకల్లు ఉపకాలువ ఆధునీకరణ కూడా ఆగిపోయింది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నుంచి ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాలకు సాగునీటిని అందించే ఈ కాలువ ఆధునీకరణ మధ్యలోనే ఆగింది. 2015లో రూ.234 కోట్లతో చేపట్టారు. రూ.188 కోట్లు ఖర్చు పెట్టాక పనులు చేపట్టలేమని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఈ బడ్జెట్‌లో ఈ పనులకు కేటాయింపుల్లేనట్లుగానే కనిపిస్తోంది.

మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువది అదే పరిస్థితి

మిడ్ పెన్నార్ రిజర్వాయరు నుంచి దక్షిణ కాలువ సున్నా కిలోమీటరు నుంచి 80 కిలోమీటర్ల మేర ఆధునకీకరణకు 2015 పనులు చేపట్టారు. రూ.509 కోట్లతో చేపట్టిన ఈ పనులను రూ.205 కోట్లు ఖర్చు పెట్టాక ఆపేశారు. ఇప్పుడు ఈ పనులను చేయలేమని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో ఇవి మధ్యలోనే ఆగిపోయాయి. అనంతపురం జిల్లాలో అందే అత్యధిక సాగునీటి వ్యవస్థల్లోనే ఈ మూడు కాలువలే ప్రధానం. ఈ మూడు కాలువల పనితీరు ఇలా అర్ధాంతరంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా వీటి ఆధునీకరణ పనులు మాత్రం సాగడం లేదు.



మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ (ఫైల్)

మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లక్షమందికి పైగా మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నామని తెలిపారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం ప్రారంభించనున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రయివేటు పాఠశాలల్లోనూ చదువుతున్న విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయనున్నామన్నారు. మహిళల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సగం హక్కు కల్పించారని, మహిళా యూనివర్శిటీని స్థాపించారని గుర్తు చేశారు. రాజ్యాధికారంలోనూ భాగస్వామ్యం చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు అన్నింటా మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. మహిళల పేరునే ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తున్నారన్నారు. సంపద సృష్టిలోనూ ప్రాధాన్యమిస్తూ, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటులోనూ మహిళలకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారన్నారు.

విద్యార్థులందరికీ 'తల్లికి వందనం'

ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రయివేటు పాఠశాలల్లోనూ చదుకున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇంట్లో ఎంత మంది విద్యార్థులుంటే అందరికీ ఈ పథకం కింద ఏటా రూ.15 వేలు అందజేస్తామన్నారు. రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లక్ష మందికిపైగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. శిక్షణ అనంతరం కుట్టు మిషన్లు అందజేయబోతున్నామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని కూడా నెరవేర్చబోతున్నట్లు మంత్రి ప్రకటించారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతితో సమాజానికి మేలు

మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధిస్తే ఆయా కుటుంబాలతో పాటు సమాజం కూడా మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి తెలిపారు. పురుషుల ఆదాయంతో పాటు మహిళలు సంపాదిస్తే ఆ కుటుంబాలు ఎంతో ఉన్నతి స్థితికి చేరుకుంటాయన్నారు. టైలర్స్ కావాలంటూ ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ, గార్మెంట్స్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. జాబ్ మేళాలో ఎంపికైన వారికి రూ.13 వేలకు పైగా వేతనంతో పాటు ఇంటెన్సివ్‌లు కూడా ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజక వర్గంలో పలు చోట్ల ఇటువంటి జాబ్ మేళాలు నిర్వహించే ఆలోచన ఉందన్నారు. ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఆధ్వర్యంలో జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్ మేళాలో పాల్గొన్నందరికీ ఉచిత భోజన వసతి సదుపాయాలను మంత్రి సవిత కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు

కాలువలు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా మురుగు కాలువలను ఆక్రమించుకుని అక్రమ కట్టడాలను కడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుండి ఆర్టీసీ బస్ స్టాండ్ వరకు ఇరువైపులా మురుగు కాలువలను ఆక్రమించుకుని వ్యాపార సముదాయాల వారు అక్రమ కట్టడాలను నిర్మించుకున్నారు. దీంతో మురుగు కాలువల్లో మురుగు అక్కడిక్కడే నిలిచిపోవడం, రోడ్డు పైకి రావడంతో పాటు తాగునీరు సరఫరా అయ్యే పైప్ లైన్ లో మురుగు నీరు కలుస్తోంది. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులతో కలిసి మున్సిపల్ ఛైర్మన్ ఆదివారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. వెంటనే అక్రమ కట్టడాలను తొలగించి, చిన్న జెసిబితో కాలువలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఒ శోభన్ రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్, టీడీపీ నాయకులు సురేష్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం వాసికి రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత డిజైనర్, వీవర్ జూటూరు నాగరాజుకు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వం చేనేతను ప్రోత్సాహం కల్పించే వివిద్‌కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ధర్మవరం పట్టుచీరల ప్రదర్శన కోసం రాష్ట్రపతి భవన్‌లో ఎక్స్‌పో నిర్వహణకు నాగరాజును ఆహ్వానించారు. నాగరాజు గత సంవత్సరం ఆగష్టు 15 న స్వతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ విందుకు కూడా ఆహ్వానం అందుకున్నారు. దేశ రాజధానిలో ధర్మవరం పట్టు చీరల ప్రత్యేకతలను తెలిపేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోందని నాగరాజు తెలిపారు.

మోసాలకు పాల్పడితే సహించం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల వ్యాప్తంగా ఎవరైనా కబ్జాలకు, మోసాలకు పాల్పడితే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని, వారిపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అప్ గ్రేడ్ స్టేషన్ సిఐ ఆంజినేయులు హెచ్చరించారు. కొందరు స్వార్థపరులు రూరల్ మండలం కిరికెర గ్రామం సర్వే నెంబరు 243-2లో ప్లాట్ నెంబరు 91ని కబ్జా చేయాలని తప్పుడు పత్రాలతో పాటు తప్పుడు ఆధార్ కార్డ్ ను సృష్టించి ప్లాటును తమ పేరిట అగ్రిమెంట్ చేయించుకొని బాదితులను మోసం చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్లాటు తనదని ముద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సువర్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. హిందూపురం మండలం సంతేబిదనూరు గ్రామానికి చెందిన శివయ్య, హిందూపురం పట్టణంలోని వాసవి ధర్మశాల రోడ్డులో నివాసం ఉంటున్న భరత్, గాంధీనగర్ కు చెందిన ఫైరోజ్ ఖాన్ లు ముగ్గురు కలిసి సువర్ణమ్మకు చెందిన స్థలాన్ని కబ్జా చేయాలనే ఉద్దేశ్యంతో తప్పుడు పత్రాలను సృష్టించి క్రయ విక్రయాలను జరపాలని సిద్ధం అయినట్లు తమ విచారణలో తేలిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చినట్లు చెప్పారు. విచారణ చేసిన న్యాయమూర్తి నిందితులకు 7 రోజుల పాటు రిమాండ్ విధించారన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

17 మంది అరెస్టు, 10 ద్విచక్ర వాహనాలు, రూ. 81 వేలు నగదు స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలో అప్ గ్రేడ్ సిఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పలు పేకాట స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 17 మందిని అరెస్టు చేయడంతో పాటు రూ. 81 వేలు నగదు, 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. చెర్లోపల్లి, పత్తి కొండపల్లి సరిహద్దులో గల కొండ ప్రాంతాల్లో పేకాడుతున్న స్థావరంపై దాడులు చేపట్టామన్నారు. జూదం నడిపిస్తున్న అశ్వత్థప్పతో పాటు జూదరులను అరెస్టు చేసి అందరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో తనతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీలో అంగన్వాడీలే కీలకం

జిల్లా మహిళా సాధికారత, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధా వరలక్ష్మి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

గర్భిణులతో పాటు బాలింతల, మహిళల ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరమని, ఇందులో అంగన్వాడీలదే కీలకపాత్ర అని జిల్లా మహిళా సాధికారిత, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధా వరలక్ష్మి తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 6 ఏళ్ల వరకు అంగన్వాడీ కేంద్రాల్లో తల్లి బిడ్డకు పౌష్టికాహారం అందించడం, గర్భిణులకు, బాలింతలకు తగు జాగ్రత్తలు తెలుపుతూ గ్రామాల్లో అంగన్వాడీలు, మినీ అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు ప్రముఖ పాత్ర వహిస్తున్నారు. ఇవి కాక ఓటు నమోదు కార్యక్రమాలు, పింఛన్లు పంపిణీ తదితర అదనపు పనులు అధికారుల ఆదేశాల మేరకు చేస్తుంటారు. ఇవి కాక అధికారుల పెత్తనం రాజకీయ నాయకుల ఒత్తిడులు తట్టుకొని తమ విధులు నిర్వర్తిస్తుంటారు. ఇంత చాకిరీ చేసినా వారికి కనీస వేతనాలు అమలు కావడం లేదు. రిటైర్డ్‌మెంట్ తరువాత ప్రభుత్వము నుంచి ఎలాంటి బెనిఫిట్స్ అందడం లేదు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు మేరకు కనీస వేతనం రూ. 26 వేలు, గ్రాడ్యుటీ, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలి. కానీ అవి అమలు కావడం లేదు. అంగనవాడీ వర్కర్లకు అయితే రూ.11వేలు, మినీ వర్కర్లు ఆయాలకు రూ.7వేలు మాత్రమే వేతనాలు అందుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇతర సౌకర్యాలు కల్పించాలని అంగన్వాడీ వర్కర్ల యూనియన్, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకై ఈనెల 10న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా మహిళా సాధికారిత, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సుధా వరలక్ష్మి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.



ప్రశ్న : జిల్లాలో ఎన్ని అంగన్వాడీలు ఉన్నాయి? వాటి వివరాలు తెలపండి.?

జవాబు : జిల్లాలో మొత్తం 2824 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 617 మినీ అంగనవాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలు 12 ప్రాజెక్టు కేంద్రాల పరిధిలో ఉన్నాయి. ప్రాజెక్టు కేంద్రాలు పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, బత్తలపల్లి, పెనుకొండ, సోమందేపల్లి, మడకశిర, హిందూపురం, గుడిబండ, నల్లచెరువు, ఒడిసి ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణలో అంగనవాడీ కేంద్రాలు పని చేస్తాయి. ప్రతి ప్రాజెక్టుకు సిడిపిఒ, సూపర్వైజర్లు ఉంటారు.

ప్ర: ఈ కేంద్రాల్లో ఎంతమంది అంగన్వాడీలు ఉంటారు? వారి విధులు ఏమిటి.?

జ : ప్రధాన అంగన్వాడీ వర్కర్లు 2187 మంది, మినీ వర్కర్లు 612 మంది, సహాయకులు (ఆయాలు) 2137 మంది ఉన్నారు. జిల్లాలో 6386 మంది గర్భిణులు ఉండగా 3614 మంది బాలింతలుఉన్నారు. 6 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలు 37606 మంది, 3 నుంచి 6 ఏళ్ల పిల్లలు 35161 మంది ఉన్నారు. పిల్లల వయస్సు బట్టి పాలు, గుడ్లు, భోజనం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ కేంద్రాల్లోని పిల్లలకు విద్యను అందించే విధంగా అంగన్వాడీలు చర్యలు తీసుకుంటారు. అదే 6 నెలల గర్భిణులు, బాలింతలకైతే సరుకులు 6 నెలల పాటు పంపిణీ చేయడం జరుగుతుంది. 3 నుంచి 6 ఏళ్ల పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి వస్తేనే వారికి పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుంది. ఇదంతా ఆయా ప్రాజెక్టు సిడిపిఒ, సూపర్వైజర్లు పర్యవేక్షిస్తుంటారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వారు సరిదిద్దుతారు.

ప్ర : అంగన్వాడీలు, మినీ అంగన్వాడీలు, సహాయకుల సమస్యలపై మీ చర్యలు ఏమిటి.?

జ: మా పరిధిలో వరకు ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం. వారు వేతనాలు పెంచాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యుటీ అమలు తదితర సమస్యలు మా పరిధిలో లేవు. వాటిపై ప్రభుత్వం విధాన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అంగనవాడీ యూనియన్ నాయకులు, ప్రజా సంఘాలు మా దృష్టికి తెచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదిస్తాం. మా పరిధిలో పరిష్కరించే సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకుంటాం.

ప్ర : అంగన్వాడీలకు, గర్భిణులకు, బాలింతలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి.?

జ : గర్భిణులు మొదటి నుంచి పౌష్టిక ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డతోపాటు ఆ మహిళలు ఆరోగ్యంగా ఉంటారు. గర్భిణిగా ఉన్న సమయంలో బరువులు ఎత్తడం, ఇంటి పనులు చేయడం లాటి వాటికి దూరంగా ఉండిఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలి. తరచూ ఆరోగ్య కార్యకర్తలు ఇచ్చే ఆరోగ్యపరమైన సలహాలు జాగ్రత్తలు పాటించాలి. బాలింతలు కూడా బిడ్డ సంరక్షణతో పాటు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. అవసరమైన మందులతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. అంగన్వాడీలకు సహకరించాలి. అంగన్వాడీలు కూడా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులకు, బాలింతలకు పసిపిల్లలకు సక్రమంగా అందించే విధంగా విధులు నిర్వర్తించాలి. వారికి సేవలందిస్తున్నామనే అంకితభావంతో పని చేసి మన్ననలు పొందాలి.



ఐసిడిఎస్ పీడీ సుధా వరలక్ష్మి

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని మంత్రి కార్యాలయంలో ఆదివారం మంత్రి సవిత సమక్షంలో గోరంట్ల మేజర్ పంచాయతీ సర్పంచి సరోజానాగేనాయక్‌తో పాటు 200 కుటుంబాలు టిడిపిలో చేరాయి. సర్పంచితో పాటు వారందరికీ మంత్రి టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే గోరంట్ల మండలంలోని మలసముద్రం పంచాయతీలో 12 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వారిలో డి.భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎల్.భాస్కర్‌రెడ్డి, గురుప్రసాద్ రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సి.రామకృష్ణ, హెచ్.నారాయణ, హెచ్.ఊతప్ప తదితరు లకు మంత్రి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచి సరోజరాగే నాయక్ మాట్లాడుతూ గతంలో అనివార్య కారణాల వల్ల వైసిపిలోకి చేరామన్నారు. తిరిగి సొంత గూటికి చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని నమ్మి టిడిపిలో చేరామన్నారు. వైసిపి హయాంలో పంచాయతీలకు రావాల్సిన నిధులను పక్కదోవ పట్టించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే గోరంట్ల మండలంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలో చేరుతున్నారన్నారు. త్వరలో నియోజకవర్గంలో వైసిపి నుంచి టిడిపిలోకి భారీ చేరికలు ఉంటాయని, చేతనైతే వైసిపి నాయకులు ఆపుకోవాలని సవాల్ చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇచ్చేది ప్రధానమంత్రో, ముఖ్యమంత్రో కాదు.. ప్రజలంటూ జగన్‌పై మండిపడ్డారు. కార్యక్రమంలో గోరంట్ల మండల టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల సర్పంచి, 200 కుటుంబాలు టిడిపిలో చేరిక



మంత్రి సమక్షంలో టిడిపిలో చేరిన గోరంట్ల సర్పంచి సరోజారాగేనాయక్, ఇతరులు

మానవత్వం చాటుకున్న మంత్రి సవిత

ప్రమాదంలో గాయపడి రోడ్డుపై నిస్సహాయంగా పడి ఉన్న వ్యక్తిని మంత్రి సవిత ఎస్కార్ట్ వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. వివరాలు.. మంత్రి పట్టణంలో ఓ శభ కార్యానికి హాజరై ఆ తర్వాత ఇంటికి వెళ్తుండగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద పెనుకొండ మండలం దుద్దేబండ గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు ప్రమాదానికి గురై నిస్సహాయంగా రోడ్డు పడి ఉండగా మంత్రి గమనించి కాన్వాయ్‌ను ఆపారు. అతడిని తన ఎస్కార్ట్ వాహనంలో ఎక్కించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులకు ఫోన్ చేసి క్షతగాత్రుడికి మెరుగైన వైద్యమందించాలని ఆదేశించారు.

ప్రీకాట్ 'బి' మిల్లు మూసివేతను ఆపాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రీకాట్ 'బి' మిల్లును యాజమాన్యం అక్రమంగా మూసివేయాలని చూస్తుందని, దానిని ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని మంత్రి నివాసంలో మంత్రి సవితకు వినతి పత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి మాట్లాడుతూ పరిగి మండలంలోని కొడిగెనహల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ప్రీకాట్ 'బి' లిమిటెడ్ స్పిన్నింగ్ మిల్లు స్థాపించి(1983) 42 ఏళ్లు పూర్తయిందన్నారు. మిల్లు యామాన్యం నూలు వ్యాపారం చేస్తూ లాభాలు గడిస్తూ అనుబంధ సంస్థలు సైతం స్థాపించిందన్నారు. ఈ పరిస్థితుల్లో యాజమాన్యం



మంత్రి సవితకు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ప్రభుత్వం, లేబర్ అధికారులు, కార్మికులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఉన్నఫళంగా మూసివేసే ప్రయత్నాలు చేయ డం బాధాకరమన్నారు. మిల్లులో 25 నుంచి 37 ఏళ్లుగా పని చేసిన పర్మినెంట్, జూనియర్ పర్మినెంట్, బదిలీ కార్మికులు, 10 నుంచి 12 ఏళ్లుగా పని చేస్తున్న క్యాజువల్, ఇతర క్యాటగిరీ కార్మికులు మొత్తం 500 మందికి పైగా పని చేస్తున్నారన్నారు. మిల్లు మూసివేస్తే వందల కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదాయం కోల్పోతుందన్నారు. కావున ప్రభుత్వం చొరవ చూపి యాజమాన్యంతో చర్చించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి మిల్లును నడిపి కార్మికుల కుటుంబాలను రక్షించాలని వారు కోరారు. వినతి ఇచ్చిన వారిలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, ప్రీకాట్ వర్కర్స్ యూనియన్ నాయ కులు నాగిరెడ్డి, నాగభూషణ, గోపాలప్ప, శివకుమార్, నందకుమార్, బైలప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను బలహీనపరచొద్దు : యుటిఎఫ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రతి గ్రామ పంచాయతీలో ఐదు తరగతులకు ఐదుగురు టీచర్లు ఉండే ఒక మోడల్ ప్రాథమిక పాఠశాలను చేస్తామని, ఆ పంచాయతీలో మిగిలిన ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను మోడల్ ప్రైమరీ స్కూళ్లకు షిఫ్ట్ చేసేలా తీర్మానం చేయాలని స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ(ఎస్ఎంసి)లను పాఠశాల విద్యాశాఖ ఆదేశించడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించే సందర్భాల్లో పంచాయతీలో మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఎక్కడ నిర్వహించాలో పాఠశాల విద్యా కమిటీలతో చర్చిస్తామని, తదుపరి తల్లిదండ్రుల ఆమోదంతో మాత్రమే తగిన చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ అధికారులు చెప్పారని గుర్తు చేశారు. దీనికి భిన్నంగా మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయడానికి, ఆ పంచాయతీలోని మిగిలిన ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను తరలించడానికి అభ్యంతరం లేదనే పేరుతో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు తీర్మానాలు చేయాలని ఇచ్చిన ఆదేశాలను తక్షణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఒక పంచాయతీలో విద్యార్థుల సంఖ్య 50 దాటిన ప్రతి ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చాలని, మిగిలిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీనికి భిన్నంగా పాఠశాల విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకున్నా తల్లిదండ్రులతో కలిసి కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల పేరుతో మిగిలిన ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను బలహీనపరచడాన్ని అంగీకరించమని, ఇలాంటి చర్యలను రాష్ట్ర విద్యాశాఖ తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వారితో పాటు యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షులు బాబు, సీతాలక్ష్మి, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు సి.తాహిర్‌వలి, కె.శివశంకర్, సి.లక్ష్మీనారాయణ, జిసి.నరేష్‌కుమార్, వైవి.సుబ్బారెడ్డి, డి.అనిల్‌కుమార్, ఎం.లతాదేవి, డి.నరసింహప్ప, రాష్ట్ర కౌన్సిలర్స్ ఎంవి.మారుతి శ్రీనివాస్, ఎం.మేరీవరకుమారి, ఆడిట్ కమిటీ కన్వీనర్ యు.మహంతేశ్వర ఉన్నారు.

12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉపాధ్యాయ, ఉద్యోగులకు గతంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం తక్షణమే 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(1938) జిల్లా స్థాయి ఉద్యమ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐఫియా చీఫ్ ప్యాట్రన్ సుబ్బారెడ్డి, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి ముఖ్య అతిథితులుగా హాజరై మాట్లాడారు. జీవో 117 రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మోడల్ ప్రైమరీ(ఆదర్శ ప్రాథమిక పాఠశాల)ల ఏర్పాటు పేరుతో వేలాది ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను నిర్వీర్యపరచడం లేదా మూసి వేయడం ద్వారా మరొక్కసారి ప్రభుత్వ విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే దిశగా అడుగులేస్తోందని, దీనిని ఎపిటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రభుత్వ బడుల మూసివేతను అడ్డుకుంటామన్నారు. ఎన్నికల హామీ మేరకు ఆర్థిక బకాయిల చెల్లింపులతో పాటు వివిధ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాలువ సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌బాబు, గాజుల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బాబాఫకృద్దీన్, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా వ్యాప్త ఫెడరేషన్ శ్రేణులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు



ఖర్గేతో భేటీ అయిన రఘువీరా

ఖర్గేతో రఘువీరా భేటీ

ప్రజాశక్తి-మడకశిర రూరల్

కాంగ్రెస్ పార్టీ అధినేత మల్లికార్జున ఖర్గేను ఆదివారం ఆయన నివాసంలో సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వారు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. వారితో పాటు పలువురు పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల మహాసభ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణ శివారులోని సిఎన్‌బి ఫంక్షన్ హాలులో ఆదివారం ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు విజయభాస్కర్‌రాయల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ఉద్యోగుల సమస్యలపై చర్చించారు.

ఎంజెపి పాఠశాలలో నీటి సమస్య

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక మహాత్మజ్యోతిబాపూలే పాఠశాలలో నీటి సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి సమీపంలోని రైస్ మిల్లులో పశువుల కోసం ఏర్పాటుచేసిన నీటితొట్టి వద్దకు వెళ్లి పాచినీటితోనే శుభ్రం చేసుకుంటున్నారు. ప్రతిరోజూ వివిధ అవసరాలకు ఈ తొట్టిలోని నీటినే వినియోగిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



రైస్ మిల్లు వద్ద తొట్టెలో నీటితో ప్లేట్లు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని శిల్పారామంలో పుట్టపర్తి అర్బన్ సిఐ సునీత ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. స్వీయ రక్షణ నైపుణ్యాలు, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని, సైబర్ భద్రత నియమాలు గురించి వివరించారు. ప్రస్తుతం టెక్నాలజీ యుగంలో ఉన్నామని, మొబైల్ ఫోన్స్ ఎక్కువగా వాడటం వల్ల సైబర్ నేరాలు జరగడానికి అవకాశం ఉందన్నారు. అనాథరైజ్డ్ యాప్స్, మొబైల్స్‌లో వచ్చే లింకులు సెలెక్ట్ చేయవద్దని సూచించారు. కొత్త చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు ఉమెన్ ట్రాఫిక్, బాల్య వివాహాలు, పోలీస్ హెల్ప్ లైన్, డయల్ 100, ఉమెన్స్ సేఫ్టీ యాప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, పోలీస్ సిబ్బంది సహాయ, సహకారాలు ఉంటాయని సిఐ తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ సునీత

ఎస్.బ్రాహ్మణపల్లిలో పరిటాల శ్రీరామ్ పర్యటన




ఎస్.బ్రాహ్మణపల్లిలో పర్యటిస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని ఎస్.బ్రాహ్మణపల్లి గ్రామంలో విద్యుత్, రహదారుల సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు ధర్మవరం నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌కు విన్నవించారు. పరిటాల శ్రీరామ్ ఆదివారం మదనపల్లి నుంచి ధర్మవరం వెళ్తూ మార్గమధ్యలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు గ్రామంలో పాడైన విద్యుత్ పోల్స్, విద్యుత్ లైన్లు మార్చాలని, లో వోల్టేజీ, నీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీధుల్లో అదనంగా విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గాండ్లవారిపల్లి నుంచి ఎస్.బ్రాహ్మణపల్లికి, వలిమిచెర్లోపల్లి నుంచి ఎస్.బ్రాహ్మణపల్లికి లింక్ రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతులు ఇచ్చారు. ఆయా సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని పరిటాల శ్రీరామ్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట టిడిపి సీనియర్ నాయకులు రమేష్‌బాబు, ప్రభాకర్‌నాయుడు, కోట్ల బాబి, తుమ్మల సూరి, సురేంద్ర, చంద్ర, సుధాకర్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, కార్యకర్తలు ఉన్నారు.

పుట్టపర్తిలో ప్రధాన రహదారిపై మురుగు

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలోని ప్రధాన రహదారిలో సత్యసాయి విద్యాసంస్థల ముందు డ్రెయినేజీ ఛాంబర్ బ్లాక్ కావడంతో ఆదివారం మురుగునీరు రహదారిపై పొంగిపొర్లింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు మాట్లాడుతూ మురుగునీరు రోడ్లపై పొంగి పొర్లడంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు.



పుట్టపర్తిలో సత్యసాయి విద్యాసంస్థల ముందు పొంగి పొర్లుతున్న మురుగునీరు

బాల్య స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహితుని కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. జగరాజుపల్లి గ్రామానికి చెందిన గోపాల్ గత నెలలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబానికి పెద్ద దిక్కైన గోపాల్ మృతితో ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న గోపాల్ మిత్రులు అందరూ కలిసి రూ. లక్ష సేకరించారు. కొత్తచెరువు హైస్కూల్‌లో ఆదివారం గోపాల్ సంతాపసభ ఏర్పాటు చేసి, ఆయన కుటుంబ సభ్యులను పిలిపించి వారికి రూ. లక్ష అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విజయ్ కుమార్, భాస్కర్‌నాయుడు, భాస్కర్, రోశయ్య, పండరీనాథ్, రియాజ్, వెంకట్రాముడు, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



గోపాల్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బాల్య స్నేహితులు

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా తరహాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఆదివారం కలెక్టరేట్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొని ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి సోమవారం ఏదో ఒక అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో గ్రీవెన్స్ కార్యక్రమం చేపట్టామని, సోమవారం కలెక్టరేట్లోనే నిర్వహిస్తామన్నారు. కదిరి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీవోలు పాల్గొంటారని తెలిపారు.

సోలార్ భూనిర్వాసితుల సమస్యలపై నేడు ధర్నా

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రైతుల సమస్యలపై స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం మండల నాయకులు నాగిరెడ్డి, సిఐటియు నాయకులు నాగరాజు కోరారు. మండలంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం వల్ల రైతాంగం, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం తూర్పునడింపల్లి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. మద్రికొమ్మదిన్నె గ్రామంలో రైతులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించిన తర్వాతే సోలార్ ప్రాజెక్టు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే రైతుల తరఫున పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.



తూర్పునడింపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

పేదలకు కంటి వెలుగును ప్రసాదించడమే లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే లక్ష్యమని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, ఉపాధ్యక్షులు సుంకు సుకుమార్, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత ఐఎల్ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. యువర్స్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి బెంగళూరు(బెంగళూరు వెస్ట్ లయన్స్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి) ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించామని తెలిపారు. నేత్ర జ్యోతి ఆసుపత్రి వైద్యులు కంటి రోగులకు వైద్య చికిత్స అందించారు. 119 మంది మంది రాగా 42 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరందరికీ ఉచితంగా ఆపరేషన్, రవాణా సౌకర్యం కల్పిస్తారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ మామిళ్ల మాధవిలత, మామిళ్ల తులసిప్రసాద్, షీలా గంగమ్మ, షీలా పెద్ద ఈశ్వరయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కీర్తిమాల, షీలా నాగేంద్ర సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం యువర్స్ కమిటీ సభ్యులను దాతలను సత్కరించారు. కార్యక్రమంలో సహ కార్యదర్శి రమేష్‌బాబు, పిఆర్ఓ రాధాకృష్ణ, డాక్టర్ సుబ్బారావు, క్యాంపు ఛైర్మన్ పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, సత్రశాల మల్లికార్జున, సికె.రామంజి, మాజీ అధ్యక్షులు బండ్లపల్లి రంగనాథ్, రామచంద్ర గుప్తా, జయంతి వినోద్‌కుమార్, శివప్రసాద్, సికిందర్, బాలం ఆదిశేషు పాల్గొన్నారు.



దాతను సత్కరిస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు



టూ టౌన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్


ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం డీఎస్పీ హేమంత్‌కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ జన జీవనానికి ఆటంకం కలిగించినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, అసాంఘిక కార్యక్రమాలకు ప్రేరేపించినా, పాల్గొన్నా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంచి నడవడికతో ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో రెండో పట్టణ సిఐ రెడ్డప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై నేడు ధర్నా

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రైతుల సమస్యలపై ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న నాయకులు ఎస్‌హెచ్ బాషా, హరి తెలిపారు. వారు ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో కరువు కాటకాలు, వాతావరణ పరిస్థితులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల వల్ల రైతులు అన్ని విధాలుగా నష్టపోతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో అన్ని పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యం, సాగునీరు, సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, నిరంతర విద్యుత్, పాసు పుస్తకాలు, భూసమస్యలు పరిష్కరించాలని, రైతుల ఆత్మహత్యలు, వలసలను అరికట్టాలని అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అలాగే హంద్రీనీవా కాలువను వెడల్పు చేస్తూ అన్ని చెరువులను నీటితో నింపాలని, పంటలకు గిట్టుబాటు ధర, రైతులకు బీమా సౌకర్యం కల్పించాలని, పాల ధర పెంచి, పాడి రైతులకు పశుగ్రాసం, దాణా ఖర్చులు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకులు

సిఎం వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు, రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రతిపక్షపార్టీల నాయకు లకు ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఎటువంటి పనులు, లబ్ధి చేకూరేలా ఉండరాదని వ్యాఖ్యానించడంపై సుప్రీంకోర్టు, రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి కోరారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అనుసరించి రాగద్వేషాలకు అతీతంగా అందరికీ న్యాయం చేస్తానని ప్రమాణం చేసిన సిఎం చంద్రబాబు ఇలా మాట్లాడటం సరికాదన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సిఎం చంద్రబాబు వారి మాటలను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.



ఆనందరంగారెడ్డి

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని పార్థసారధినగర్‌లో ఆదివారం వేకువజామున మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా చెత్త నిల్వలు ఉండకూడదని కార్మికులకు సూచించారు. వార్డుల్లో చెత్తను డంప్ చేయకూడదన్నారు. చెత్త నిల్వల వల్ల పిల్లలు, ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడే చెత్తను తరలించాలని కార్మికులను ఆదేశించారు. చెత్త తరలించిన తరువాత ఆ ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. వీధుల్లో పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు.

నాటుసారా స్వాధీనం.. విక్రేత అరెస్టు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని డి.చెర్లోపల్లి క్రాస్ వద్ద నాటుసారా విక్రేతను అదుపులోకి తీసుకొని అతడి నుంచి నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ చంద్రమణి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నవోదయం 2.0లో భాగంగా నాటుసారాను అరికట్టేందుకు ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని డి.చెర్లోపల్లి క్రాస్ వద్ద మెరుపు దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో నాటుసారా విక్రయిస్తున్న చిన్నకుళ్లాయప్పనాయక్‌ను అరెస్టు చేసి నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారు చేసి అమ్ముతుంటే పోలీసులకు సమాచా రం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచి తయారీదారుపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా నాటుసారా తాగి ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దని సూచించారు. దాడులలో ఎస్ఐ చాంద్‌బాషా, ఓబిరెడ్డి, సుధాకర్ రెడ్డి, సునీత, చంద్ర, రఘురామ్ పాల్గొన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని కునుతురు గ్రామ సమీపంలో ఆదివారం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అలాగే వాహనదారులతో సమావేశం ఏర్పాటు చేసి కొత్తగా అమలులోకి వచ్చిన మోటర్ వెహికల్ జరిమానా గురించి వివరించారు. ఎవరైనా ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని తెలిపారు. వాహనదారులు తప్పకుండా వాహనాలకు సంబంధించిన పత్రాలు, లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సూచించారు.

హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-రొద్దం

ద్విచక్ర వాహనదారులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ నరేంద్ర సూచించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆదివారం ఆయన ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి బైక్ నడపాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి కలిగి ఉండాలన్నారు. కార్లు నడిపే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు. మొదటిసారి పట్టుబడితే జరిమానా రాస్తామని, మరోసారి పట్టుబడితే బండి సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నియమ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు.




వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నరేంద్ర, పోలీసులు

ప్రయివేటుకు దీటుగా 'పది' విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్ ఉపాధ్యాయులు ప్రయివేటు పాఠశాలలకు దీటుగా పదో తరగతి విద్యార్థినులను సన్నద్ధం చేస్తున్నారు. హైస్కూల్‌లో దాదాపు 300 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఈ క్రమంలో సోమవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకూ విద్యార్థులకు గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకూ పబ్లిక్ పరీక్షలు ఉంటాయి. ఆ పరీక్షల సమయానికి విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడానికి సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థిని నందిని మాట్లాడుతూ ధర్మవరం నుంచి వచ్చి కదిరి జడ్పీ బాలికల హైస్కూల్‌లో చదువుతున్నాన్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థినులందరూ ఉత్తీర్ణులు కావడానికి ఉపాధ్యాయులు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థి చైతు మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల పట్ల భయాన్ని దూరం చేసేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారన్నారు. బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆదివారం ఉపాధ్యాయులు హరిప్రసాద్, మోహన్ పర్యవేక్షించారు.



విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు